## తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్

7లో..




# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8


# అంతా మా ఇష్టం..
# మా వెనుక పెద్దోళ్ళు ఉన్నారు

- చట్టాలను ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణ దందా..
- జీహెచ్ఎంసీ టౌన్ ప్లాన్ కార్యాలయామే కేంద్రంగా అక్రమార్కుల సిండికేట్ వ్యవహారాలు..
- నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల గండి
- జీహెచ్ఎంసీ నుండి తీసుకున్న అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు పొంతన ఉండదు



భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ చేసిన చట్టాలను అమలు చేసేందుకు జీహెచ్ఎంసీ లో టౌన్ ప్లాన్ విభాగం.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ అనుమతులు, చేస్తున్న నిర్మాణాలపై కచ్చితమై పర్యవేక్షణ, చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరిపితే చర్యలు, నోటీసులు ఇచ్చి కూల్చివేతలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులది. కానీ అటువంటి కార్యక్రమాలు నిర్దిష్టంగా అమలు చేస్తున్నట్టు ఎక్కడ కూడ టౌన్ ప్లాన్ కార్యాలయం, అధికారులు మచ్చుకైనా కనిపించరు. గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో విచ్చల విడిగా ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ బహుళ అంతస్థుల భవనాలు యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నారు. నగరం విస్తరిస్తున్న కారణంగా అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు నిర్దిష్టమైన భవన నిర్మాణ చట్టాలు తెచ్చారు. కానీ అవేవి అమలు జరుగుతున్న దాఖలాలు లేవు..

వివరాలు 2లో

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి20,(నినాదం న్యూస్):



ఆదానీ కోసం దేశాన్ని అమెరికాకు తాకట్టు
## పెడుతున్న మోడీ చర్యలు దుర్మార్గం

- కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు

భారతదేశాన్ని లూటీ చేస్తున్న ఆదానీపై అమెరికాలో నమోదైన అవినీతి, లంచం కేసులో తప్పించడానికే మోడీ ఇటీవల అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తో సమావేశం అయ్యాడని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

2లో..

24న రాష్ట్రవ్యాప్తంగా
## జర్నలిస్టుల నిరసన

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు
- సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో
## ప్రత్యేక స్క్రీనింగ్ డ్రైవ్

- మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి గౌరీ



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి20 (నినాదం న్యూస్): ఫిబ్రవరి 20 నుండి మార్చి 31, వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక (ఎన్ సీ డీ) స్క్రీనింగ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గురువారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్ సి ఉప్పల్ ) లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ప్రారంభించారు. స్క్రీనింగ్ పనితీరుపై సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి, డాక్టర్. ఉమా గౌరి మాట్లాడారు. సూపర్వైజర్లు, ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు స్క్రీనింగ్ శాతం పెంచాలని సూచించారు. అలాగే, సమర్ధవంతమైన పర్యవేక్షణ కోసం ప్రతి రోజు ప్రామాణిక ఫార్మాట్‌లో నివేదికను పి హెచ్ సీ, యూ పీ సీ వైద్య అధికారులు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఈ నివేదిక బిడికే, పిడికే, ఎస్సి ల నుండి సమగ్ర డేటాను సేకరించి సమీకరించాల్సి ఉంటుంది అని ఆమె ఆదేశించారు.

# అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు

- నీ చెంచా విలేకరులే వార్తలు రాస్తున్నరు
- అక్రమాలపై అన్నిపత్రికలు ఎందుకు రాస్తలేవు ?
- ఇసుక, బూడిద, తదితరాలన్నీ న్యాయంగానే నడుస్తున్నాయి
- కాంగ్రెస్ నేత మహాంకాళి స్వామి



2లో..

# అంతా మా ఇష్టం..
# మా వెనుక పెద్దోళ్ళు ఉన్నారు

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి20,(నినాదం న్యూస్):** చట్టాలు ఉన్నాయని చెప్పడానికి సామాన్యులపై ప్రయోగించడానికే తప్ప మాకు వర్తించవు అన్న విధంగా బిల్డర్లు, బడా వ్యాపారుల తీరు ఉంది. చట్ట విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకొని చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎక్కడ కనిపించరు. ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చినా పెద్దగా చర్యలు తీసుకోరు. కలక్షన్ల కోసమే జీహెచ్ఎంసీ టౌన్ విభాగం అనేది ప్రజల నుండి వచ్చే బలమైన ఆరోణలు ఉన్నాయి. భవన నిర్మాణ దారులు తీసుకునేది రెసిడెన్షియాల్ కట్టేది మాత్రం కమర్షియల్ భవనాలు.. రెండు మూడు అంతస్థులకు అనుమతులు పొంది అదనపు అంతస్తులు వేస్తున్నారు. మాస్టర్ నియమ నిబంధనలకు పాటించకుండా వ్యాపార భవనాలు, సెల్లార్ల నిర్మాణాలు యథేచ్ఛగా చేస్తున్నా చర్యలు తీసుకోరు. పట్టించుకునే వారు కనిపించరు. ఉల్లంఘనల వెనుక రాజకీయ ప్రజా నాయకులు, అధికారులు ఉండి అక్రమ నిర్మాణ సిండికేట్ దందా నడుపుతూ ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయాల గండి కొడుతున్నారు. అంతే కాదు వారి అక్రమ సంపాదన కోసం బౌషత్ ప్రజల సమస్యలకు కారణమైతున్నారు. కాప్రా, మల్కాజిగిరి, అల్వాల్, ఉప్పల్ జీహెచ్ఎంసి సర్కిళ్ల పరిధి లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలు విస్తరిస్తున్నాయి. వ్యాపార భవనాలు వెలుస్తున్నాయి. కానీ ప్రభుత్వ టౌన్ ప్లాన్ చట్టాలు అమలు జరగక పోవటం బౌషత్ ప్రజలకు తీరని నష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలనీలు ప్రధాన రోడ్ల వెంట నియమాలకు విరుద్ధంగా బహుళ అంతస్థుల భవనాలు, వ్యాపార సముదాయాల్లో చేపట్టే నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ నిర్దిష్ట చట్టాలు అవేవి పట్టింపు లేకుండా ఉల్లంఘనలకు పాలుపడుతూ బిల్డర్లు, భవన యజమానులు ఇష్టానుసారనగా నిర్మాణాలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ బహుళ అంతస్థుల భవనాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. బిల్డర్లు, భవన యజమానులు టౌన్ ప్లాన్ కార్యాలయం నుండి పొందిన అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు ఎక్కడ పొంతనలు కనిపించవు. తీసున్న అనుమతులు రెండు అంతస్తులకు కట్టేది మాత్రం మూడు నాలుగు అంతస్తులు.. రెసిడెన్షియల్ పర్మిషన్ పొంది, వ్యాపార భవనాలు కడుతున్నారు. పాత రెసిడెన్సిల్ భవనాలను రేనోవేషన్స్ చేసి కమర్షియల్ గా మారుస్తున్నారు. మాస్టర్ ప్లాన్ నియమ నిబంధనలు ఎక్కడ కూడ పాటిస్తున్న పరిస్థితులు కనిపించవు.. ఇదంత అధికారులు, ప్రజా నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయనేది జగమెరిగిన సత్యం.! రాజకీయ దళారులు అక్రమ సంపాదనలకు పెద్ద వనరులుగా మార్చుకున్నరనేది ప్రజల నుండి ఆరోపణలు వస్తున్నా దున్నపోతుపై వాన చినుకు అనే చందంగా ఉంటది వారి వ్యవహారం. కాలనీ ప్రధాన రహదారులపై చేస్తున్న నిర్మాణాలకు రోడ్ల వైడింగ్ లు, సెట్ బ్యాక్స్, సెల్లర్స్ నిబంధలను పాటిస్తున్న పరిస్థితులు ఎక్కడ కనిపించవని దీంతో బౌషత్ ప్రజలకు అవస్థలు తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయా కాలనీల అభివృద్ధి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై నిత్యం అధికారులకు పిర్యాదులు చేసినా పత్రికలు కథనాలు రాస్తున్నా పెద్దగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్న పరిస్థితి ఉంది. టౌన్ ప్లాన్ కార్యాలయంలో అక్రమార్కులదే రాజ్యం.. ఇక్కడ ప్రతి అక్రమ నిర్మాణ ఫైలుకు ఒక లెక్క ఉంటది. అవి ముట్టాకే ఫైలు ముందుకు కదులుతది. లక్షల్లో లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్న జీహెచ్ఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని అభివృద్ధి సంఘాల నాయకులు కోరుతున్నారు.

## అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు

**కోల్ సిటీ, ఫిబ్రవరి 19(నినాదం):** ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ నేత కౌశికహరి ఆరోపణలు చేస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నేత మహంకాలి స్వామి అన్నారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.బసంత్ నగర్ కేషోరాం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను శాశ్వత ఉద్యోగుల్ని చేసిన ఘనత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దే అని గుర్తుచేసారు. ఎన్నికల హామీ ప్రకారం ఇతర రాష్ట్రానికి చెందిన బీహార్ కార్మికులను వెళ్లగొట్టి ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. పీసీ పటేల్ కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేస్తే యాజమాన్యంతో మాట్లాడి వారికి జీతాలు పెంచామన్నారు. లక్ష్మీ నగర్ ను అభివృద్ధి చేస్తున్నామని మార్చ్ 15వ తేదీ వరకు అన్ని రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్ వాటర్ ఏర్పాటు చేసి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



# ఆదానీ కోసం దేశాన్ని అమెరికాకు తాకట్టు పెడుతున్న మోడీ చర్యలు దుర్మార్గం

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్)** : భారతదేశాన్ని లూటీ చేస్తున్న ఆదానీపై అమెరికాలో నమోదైన అవినీతి, లంచం కేసులో తప్పించడానికే మోడీ ఇటీవల అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తో సమావేశం అయ్యాడని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం నేడు షాపూర్ నగర్ ఏఐటీయూసీ పొట్లూరి నాగేశ్వరావు భవన్ లో జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కూనంనేని సాంబాశివారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అమెరికా వెళ్లి ట్రంపును కౌగిలించుకోవడం ధృతరాష్ట్ర కౌగిలిగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ కేవలం వ్యాపారస్తుల కోసం వెళుతున్నాడే కానీ, భారతదేశ పౌరులను సంకెళ్లు వేసి భారత్ కు పంపిస్తుంటే కనీసం ఖండించకుండా ట్రంప్ ని పొగడడం మోడీకే చెల్లిందని పేర్కొన్నారు. మోడీ విధానాల వల్ల భారతీయులకు అవమానకరంగా మారిందని, దేశంలో మోడీ మత రాజకీయాల వల్ల ప్రజల మధ్య విద్వేషాలు పెరిగిపోయాయని ఆవేద వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కూడా విడదీసి పరిపాలన సాగిస్తున్నాడని కేవలం తన పదవి కోసం అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, దీనిని కమ్యూనిస్టులు ప్రతిఘటిస్తారని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ కమ్యూనిస్టుల గురించి అవమానకరంగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు.ఫామ్ హౌస్ లో ఉండి ప్రజాస్వామ్యం పై చిత్తశుద్ధి లేని కెసిఆర్ తన రాజకీయాల గురించి మాట్లాడుకోవాలి గాని కమ్యూనిస్టుల గురించి మాట్లాడే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా తనని ఎన్నుకున్న ప్రజల కోసం ప్రతిపక్ష నాయకునిగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేసీఆర్ అవలంబించిన విధానాలనే అవలంబిస్తున్నారని ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తాత్సారం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్టీసీ కార్మికుల యూనియన్లను పునరుద్ధరించి ఎన్నికల నిర్వహించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ వదిలిన చొక్కాలను తొడుక్కొని అనేక నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. అటువంటి విధానాలను సమీక్షించుకొని కమ్యూనిస్టులు సూచించిన విధంగా ప్రజా సంక్షేమ చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇదే విధమైన ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే కమ్యూనిస్టులు కచ్చితంగా పోరాడుతారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రం యొక్క అన్ని జిల్లాలలో, మండలాలలో, గ్రామాలలో పార్టీ పునర్నిర్మాణం కోసం మహాసభ నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో ఖమ్మంలో ఐదు లక్షల మందితో అతిపెద్ద బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో కుత్బుల్లాపూర్ లో, జగద్గిరిగుట్ట ప్రాంతంలో 3వేల ఎకరాల భూములను 25వేల కుటుంబాలకు ఇళ్ల స్థలాలను పంచిన చరిత్ర సిపిఐ కి ఉన్నదని వివరించారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ నేడు కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటు కొరకు సిపిఐ చేసిన పోరాట ఫలితంగా 25 ఎకరాలను కేటాయించడం జరిగిందని, పరికిచెరువు పరిరక్షణ కొరకు చేసిన ఉద్యమం వల్ల హైడ్రా అధికారులు చెరువును పరిరక్షించడానికి చర్యలు మొదలుపెట్టారని ఇవి సిపిఐ సాధించిన ఫలితాలని సాంబశివరావు తెలిపారు. రానున్న రోజుల్లో బస్ డిపో ఏర్పాటు కొరకు, గురుకుల పాఠశాలల కొరకు ఉద్యమిస్తామన్నారు. గాజులరామారంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. మేడ్చల్ జిల్లాలో కూడా రాబోవు స్థానిక ఎన్నికల్లో పార్టీని నిలబెట్టి అనేక స్థానాలను గెలిపించుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పతాకాన్ని కార్యాలయం ఎదురుగా ఆవిష్కరించారు. సమావేశానికి ముందు ప్రజా ఉద్యమాలలో అమరులైన వారికి సంతాపాన్ని తెలిపారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ విఎస్. బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ యూసుఫ్, జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్,ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేసు రత్నం, జిల్లా సహాయ కార్యదర్శులు జీ. దామోదర్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, స్వామి, శంకర్, వెంకట్ రెడ్డి, కల్లూరు ధర్మేంద్ర, జె. లక్ష్మీ, మరియు జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్య ప్రసాద్, బాలరాజ్, శ్రీనివాస్,లొట్టి ఈశ్వర్, జయచంద్ర, లక్ష్మీ నారాయణ, సహదేవ్, నరేంద్ర ప్రసాద్, ప్రమీలా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# 24న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి20,( నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలియజేస్తూ కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది. హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య గత కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ పై నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు ఆయా అంశాలపై దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలతో పాటు తక్షణం పరిష్కరించాల్సిన పలు అంశాలపై పై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశం ఆమోదించిన తీర్మానాలను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య గురువారం మీడియాకు విడుదల చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న,మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్ల పరిష్కారాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం




డిమాండ్ చేస్తూ తీర్మానించిందని తెలిపారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని అన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదనీ,దీని వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని వాఖ్యానించారు.జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి కొత్త ప్రభుత్వానికి ఏడాదిగా సమయం ఉన్నా, ఇంత వరకు పరిష్కరించ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లి25 నుంచి సభ్యత్వ నమోదు..లి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల ఫిబ్రవరి 25 నుంచి మార్చి 25వ తేదీ వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సమావేశం తీర్మాణం చేసింది. అన్ని జిల్లాల్లో సభ్యత్వ నమోదు జరుగుతుందని, జర్నలిస్టులంతా ఐక్యత, హక్కుల సాధన కోసం ఫెడరేషన్ లో సభ్యులుగా చేరి భవిష్యత్తు కార్యాచరణలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత అన్ని జిల్లాల ఫెడరేషన్ మహాసభలు నిర్వహించాలని, మార్చి 29న రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరపాలని సమావేశం నిర్ణయించినట్లు వారు తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కొప్పు నిరంజన్, విజయానంద్, కోశాధికారి రాచమల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సలీమా, తన్నీరు శ్రీనివాస్, కర్రా అనిల్ రెడ్డి, ఈ. చంద్రశేఖర్, జగదీష్,రాజశేఖర్, మానిక్ ప్రభు,నవీన్,కార్యవర్గ సభ్యులు మణిమాల, కె. పాండురంగారావు ,నాయిని శ్రీనివాస రావు పి నాగవాణి, పరిపూర్ణం, జి హరిప్రసాద్, రమేష్, మధుకర్, పాల్గొన్నారు.

# సనాతన ధర్మమే మనుగడకు ఆధారం




**కోరుట్ల నినాదం న్యూస్ (ఫిబ్రవరి20):** ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన సనాతన ధర్మమే మన మనుగడకు ఆధారమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ అన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో శ్రీ లింగ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గర్రెపల్లి మహేశ్వర శర్మ మాట్లాడుతూ వేద వ్యాస మహర్షి మానవజాతికి అందించిన జ్ఞాన గనులే అష్టాదశ మహా పురాణాలు అని, ప్రపంచంలో ఉన్నటువంటి ప్రాచీన, ఆధునిక, ఇంకా కనుగొనబడని మరెన్నో విజ్ఞాన విషయాలన్నీ మన పురాణాల్లో, వేదాలలో దాగి ఉన్నాయి అని అన్నారు. అష్టాదశ మహా పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా రెండవ ప్రయత్నంగా ప్రస్తుతం శ్రీలింగ మహాపురాణం వింటున్నామని, ఈ పురాణంలో సృష్టికి మూలమైన, లయకారుడైన ఆ మహా శివుని గురించి, శివ లీలల గురించి సవివరంగా చెప్పబడిందని, జీవన గమనంలో మనకు ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొనే శక్తినిచ్చి, శుభాలను అనుగ్రహించే శుభకరుడే ఆ శంభుడు, శివుడు అని మహేశ్వర శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు రాచమడుగు శ్రీనివాస్ రావు, సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్ష కార్యదర్శులు మంచాల జగన్, బట్టు హరికృష్ణ పురాణ కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మోటూరి రాజేంద్రప్రసాద్, డాక్టర్ గంగ్ర దిలీప్ రావు,నిర్వాహకులు శక్కరి వెంకటేశ్వర్, నీలి కాశీనాథ్, భోగ శ్రీధర్, మంచాల రాజలింగం, లింగ ఉదయ్ కుమార్,కొత్త వాసు, పొద్దుటూరి జలేందర్, మద్రి శంకరయ్య, చలిగంటి వినోద్, రామారావు, ఎలిమిల్ల రాంనారాయణ,గంప శివ కుమార్,అల్లాడి మహేష్, మోటూరి రమేష్, చక్కరి అశోక్, లింగ రాజు , కూరగాయల శ్రీహరి,మేడి కిషన్,మానుక శ్రీనివాస్,వెలుగూరి సంతోష్,ఏనుగందుల రాజేంద్ర ప్రసాద్, దొంతుల రాంకిషన్,కోటగిరి లక్ష్మీనారాయణ, చిన్న రాజన్న, పుర ప్రముఖులు, భక్తులు, పెద్ద సంఖ్యలో మహిళా మణులు,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా

**-స్నేహ టీవీ రిపోర్టర్ కి 5000 రూపాయల ఆర్థిక సహాయం...**

**-జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతాం...**

**-కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడి శాల రఘు**



**కోదాడ/మునగాల, ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్):** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా వారి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు కొనసాగుతామని కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు పడిశాల రఘు అన్నారు. మునగాల మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన స్నేహ టీవీ రిపోర్టర్ సోమపంగు వెంకటేశ్వర్లు గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై ప్రస్తుతం ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ తరపున గురువారం వెంకటేశ్వర్లను పరామర్శించారు. అనంతరం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం చెక్కును 5000రూ వెంకటేశ్వర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటప్రధాన కార్యదర్శి గంధం వెంకటనారాయణ, చెరుకుపల్లి శ్రీకాంత్, తోటపల్లి నాగరాజు, కలకొండ బుచ్చి రాములు, కుర్ర రామారావు, గడ్డం లక్ష్మీనారాయణ, మొగిలిచర్ల నాగరాజు,సోమపంగు సూర్య తేజ, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు అనుకూల బడ్జెట్

**-సీపీఎం జిల్లా నాయకులు భూక్య సమ్మయ్య**

**వరంగల్ ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్ ) :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలను వంచన చేసి బడా కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉందనిసీపీఎం జిల్లా నాయకులు భూక్య సమ్మయ్య అన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్ ను నిరసిస్తూ వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు భూక్య సమ్మయ్య మాట్లాడుతూ 2025–26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఎజెండాగా ఉపయోగించు కున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పున సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు .ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదు. నిర్మల సీతారామన్ దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం బాధాకరమని అన్నారు. పది సంవత్సరాలనుండి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అని ఆరోపించారు. 2024 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్,2025 ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారు 2026 యూపీ బడ్జెట్, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడుతారా యావత్ దేశానికి సరిపోయే బడ్జెట్ ఎప్పుడు పెడతారని ప్రశ్నించారు. బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు విలువ లేదా అని విమర్శించారు .ఇది కేంద్ర బడ్జెట్ లా లేదు, కేవలం మూడు, నాలుగు రాష్ట్రాల బడ్జెట్ లాగా ఉందని అన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏం సాధించినట్లు అని విమర్శించారు తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా మరోసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది. కేంద్ర జీడీపీకి 5.1శాతం కాంట్రిబ్యూట్ చేస్తున్న తెలంగాణ మరోసారి మోస పోయిందని ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ములుగు ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించక పోవడం దారుణమని అన్నారు . రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ చేసిందేం లేదు అని కేంద్రం బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. ధరల నియంత్రణ ఉత్పాదక రంగాలను విస్మరించి దేశంలోని ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడం కోసం ఈ బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. రైతు కూలీల సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్ గా ఈ బడ్జెట్ ను అభివర్ణించుకోవచ్చని అన్నారు.కేంద్రానికి మద్దతు పలికిన జనతాదళ్ (యూ) బీహార్‌లో వివిధ అభివృద్ధి పనులకు గతేడాది రూ. 26,000 కోట్ల సాయం, 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్, గయాలో పారిశ్రామిక కారిడార్, నూతన విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలకు సాయం తదితరాలు పొందింది. ఎన్నికలు దగ్గర ఉన్నాయని ఇప్పటి బడ్జెట్‌లో బిహార్ కు మరిన్ని వరాల జల్లు కురిపించారు. బిహార్ లో మఖాన బోర్డు ఏర్పాటు, మిథిలాంచల్‌లో వెస్టర్న్ కోసి కెనాల్, ఐఐటీ పాట్నా విస్తరణ, బిహార్‌లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో పెరిగిపోతున్న చెత్తచెదారం



**జమ్మికుంట, ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్):** వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యంతో గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో మురికి కాలువలో చెత్తాచెదారం పేరుకొని దోమలు విపరీతంగా ఉన్నాయని గ్రామానికి చెందిన బిఆర్ఎస్వీ సీనియర్ నాయకులు వొల్లాల శ్రీకాంత్ గౌడ్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన డ్రైనేజీ పరిశుభ్రత శుభ్రపరచడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో మురికికాలువలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని మురికినీటి నిలువ వలన దోమలు, ఈగలు, క్రిమి కీటకాలు పెరిగి సీజనల్ వ్యాధుల బారినపడి గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా వెంటనే ఉన్నతాధికారులు స్పందించి స్వచ్ఛత, పరిశుభ్రతకు నిదర్శనంగా పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని తీర్చిదిద్దాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలించిన కలెక్టర్



**కరీంనగర్, ఫిబ్రవరి 20(నినాదం న్యూస్ ):** మెదక్ నిజామాబాద్ కరీంనగర్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల బ్యాలెట్ బాక్సులను ఇండోర్ స్టేడియంలోనే వేరువేరుగా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కిటికీలను పూర్తిగా ఇటుకలతో మూసివేయాలన్నారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు అమర్చాలని అన్నారు. ఫైరింజన్ 24గంటలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు పంపే ప్రతి బాలెట్ బాక్స్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి లాక్ సిస్టం సరిచూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, ఓఓ సుధాకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం... ప్రజలు సహకరించాలి

**కోదాడ/ అనంతగిరి, ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్):** అనంతగిరి మండలం గొండ్రియల సబ్ స్టేషన్ లో 11 కెవి గొండ్రియల–2 ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనంతగిరి మండల ఏఈ సీతారామయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు చెట్లు నరికే కార్యక్రమం ఉంటుందని, గొండ్రియల గ్రామంలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రైతుల సహకరించాలని కోరారు.

# చిత్రపురి అధ్యక్షుడు వల్లభనేని అనిల్ బెయిల్ రద్దు సరైనదే : సుప్రీం కోర్టు

**హైదరాబాద్ ఫిబ్రవరి 20( నినాదం న్యూస్ ) :** చిత్రపురి అధ్యక్షుడు వల్లభనేని అనిల్ బెయిల్ రద్దు సరైనదేనని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో చిత్రపురి ఉద్యమకారులు బాధితులు హర్షం వ్యక్తం చేశారు. కేసు పూర్వపరాలు ఈవిదంగా ఉన్నాయి.చిత్రపురి అక్రమాల, అవినీతి కి ప్రధాన కారకుడు వల్లభనేని అనిల్ కుమార్ పై క్రైమ్ నెం : 443/2021,రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిల్మ్ డైరెక్టర్ కస్తూరి శ్రీనివాస్ కేసు ఫైల్ చేశారు. దానిపై అరెస్ట్ అయిన వల్లభనేని అనిల్ సీఆర్ పి నెం : 1583/2024 ద్వారా 24-06-2024 న అడిషనల్ మెట్రోపోలీటన్ సెషన్స్ కోర్ట్, ఎల్. బి. నగర్ లో కండిషన్స్ తో బెయిల్ మంజూరు అయింది. అయితే బెయిల్ కండిషన్స్ ని ధిక్కరించి తేదీ 26-06-2024 న చిత్రపురి ఆఫీస్ లో పత్రికా సమావేశం పెట్టి పోలీస్ స్టేషన్ లో కేసులు పెట్టినంత మాత్రాన ఇండ్లు రావంటూ కేసులు పెట్టినవారిని బెదిరించటం, తేదీ 27-06-2024న జ్యూడిషల్ పరిధిని దాటి వెళ్లొద్దాంటూ ఉన్న బెయిల్ కండిషన్స్ ని ధిక్కరించి తండ్రికి బాగాలేదంటూ సాకుతో విజయవాడలో పలు మీటింగ్స్ కి కోర్ట్



అనుమతి లేకుండా వెళ్ళటం జరిగింది. అంతేకాకుండా తేదీ : 04-08-2024 న చిత్రపురి సర్వసభ్య సమావేశం పెట్టి న్యాయం కోసం న్యాయస్థానాలకు వెళ్లిన దాదాపుగా ముప్పై మందిని సభ్యత్వాలు తీసేస్తున్నానంటూ ప్రకటిస్తూ తీవ్రంగా బెదిరించటం వంటి అంశాలను సాక్ష్యాలతో సహా తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో నెం : 8752/2024 ద్వారా కస్తూరి శ్రీనివాస్ పిటిషన్ వేశారు. సీనియర్ కౌన్సిల్ శ్రీనివాసమూర్తి వాదనలను అంగీకరించిన న్యాయస్థానం బెయిల్ కండిషన్స్ ని వల్లభనేని అనిల్ దిక్కరించాడని తెలుపుతూ బెయిల్ రద్దు చేస్తూ వారం రోజులలో సరెండర్ అవ్వాలని తేదీ 23-09-2024న ఆదేశించింది.తెలంగాణ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ నెం :13523/2024 ద్వారా సుప్రీం కోర్టు ని ఆశ్రయించి తేదీ 29-09-2024న స్టే తెచ్చుకున్నాడు. స్టే తెచ్చుకున్న తర్వాత వల్లభనేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో చిత్రపురిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లు అన్నీ థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ లకు ఎన్ ఓ సీ లు జారీ చేస్తూ, తద్వారా లక్షల రూపాయలు అక్రమంగా సభ్యుల దగ్గర వసూలు చేస్తూ ,న్యాయస్థానాలంటే లెక్కలేని విధంగా వ్యవహరిస్తూ ఉండటంతో పిటిషనర్ శ్రీనివాస్ థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ కోసం శేరిలింగంపల్లి ఎస్. ఆర్. ఓ కి ఇచ్చిన ఎన్ ఓ సీ లను కూడా సుప్రీం కోర్ట్ కి సాక్ష్యాలతో సహా అందించడం జరిగింది. వల్లభనేని అనిల్ కి ఇచ్చిన స్పెషల్ లీవ్ పిటిషన్ ని తేదీ 20-02-2025 రోజున రద్దు చేస్తూ తెలంగాణ ఉన్నతన్యాయస్థానం బెయిల్ రద్దు చేయటం సరైన చర్య అని, బెయిల్ కండిషన్స్ ని దిక్కరిస్తే సహించేది లేదని, కోర్ట్ ఆదేశాలను పాటించాల్సిందే అంటూ తక్షణమే సరెండర్ అవ్వాలని ఆదేశించింది.సుప్రీంకోర్ట్ ఆదేశాల పట్ల వల్లభనేని అనిల్ కుమార్ అండ్ కమిటీ ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు , కో ఆప్ కమీషనర్ ఉదయ్ కుమార్, జిల్లా అధికారి సుధాకర్ ల ద్వారా ఇల్లు కోల్పోయి తెలంగాణ ఉన్నత న్యాయస్థానంలో న్యాయంకోసం పోరాడుతున్న చిత్రపురి ఉద్యమకారులు, మహిళలు, వృద్దులు మరియు ఇతర బాధితులు హర్షం వ్యక్తం చేశారు. వల్లభనేని అనిల్ కుమార్ అండ్ కమిటీ , తెలంగాణ కో ఆపరేటివ్ అధికారుల మూలంగానే మేము ఇళ్ళ కోసం కోర్ట్ ల చుట్టూ గత నాలుగు - ఐదు సంవత్సరాల నుండి తిరుగుతున్నామని, మొత్తం అధికారులు చిత్రపురి కమిటీ తో కుమ్మక్కయ్యి నాటకాలు చేస్తున్నారని బాధితులు విమర్శించారు. ఒక ఫేక్ ఆలోట్మెంట్ , రిజిస్ట్రేషన్ చేయించుకున్న సృజన అనే టీవీ 9 మాజీ ఉద్యోగినిని ఆఫీసియల్ ఫైవ్ మెన్ కమిటీ లో మెంబెర్ గా పెట్టి మొత్తం 134 అక్రమ రిజిస్ట్రేషన్ లు చేయాలని అధికారులు చూస్తున్నారని బాధితులు తెలిపారు. అయితే సైబరాబాద్ పోలీస్ కమీషనర్ మహంతి బాధితులకు అండగా ఉంటూ న్యాయం చేస్తున్నారన్నారు. త్వరలో మాకు క తెలంగాణా ఉన్నత న్యాయస్థానంలో తప్పకుండా న్యాయం జరుగుతుందనే భావిస్తున్నామని బాధితులు తెలుపుతున్నారు.

# మోటర్ల దొంగలను పట్టుకున్న పోలీసులు

**-నలుగురి అరెస్ట్**
**-9 మోటర్లు, బైక్ స్వాధీనం**
**-దుగ్గొండి సీఐ సాయిరమణ**

**ఖానాపురం ఫిబ్రవరి20 (నినాదం న్యూస్ ) :** వ్యవసాయ మోటర్ల చోరికి పాల్పడ్డ నలుగురు నిందితులను ఆరెస్ట్ చేసినట్లు వరంగల్ జిల్లా దుగ్గొండ సీఐ సాయిరమణ తెలిపారు. గురువారం ఖానాపురం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం నర్సంపేట మండలం కొండసముద్రం తండాకు చెందిన జన్ను ముఖేష్ , ధరావత్ రాంసింగ్ ,ధరావత్ మల్లు ,



హన్మకొండ చింతగట్టు క్యాంపుకు చెందిన ఆకారపు నవీన్ లు ఒక ముఠాగా ఏర్పడ్డారు.ఈనిందితులు అశోక్ గర్ , పర్శనాయక్ తండా శివారులోని పంట కాలువలకు అమర్చిన వ్యవసాయ మోటర్లను రాత్రి వేళల్లో చోరికి పాల్పడి ద్విచక్ర వాహనంపై తరలించి చిలుకమ్మతండాలోని రాంసింగ్ మామ అయిన విజేందర్ ఇంట్లో దాచి పెట్టారు. కాగా మోటర్ల చోరిపై రైతుల పిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీస్ లకు గురువారం అశోక్ నగర్ శివారులోని సంగెం కాలువ సమీపంలో నలుగురు వ్యక్తులు మోటర్లు రిపేరు చేసే పనిముట్లతో అనుమానస్పదంగా కనిపించగా వారిని పోలీస్ లు అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. దీంతో మోటర్ల చోరికీ పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. కాగా నిందితుల నుండి 9 మోటర్లు , పనిముట్లు, ద్విచక్ర వాహనం స్వాధీను చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖానాపురం ఎస్ ఐ రఘుపతి , పోలీస్ సిబ్బంది సంతోష్ , హనున్ వీరస్వామి , లింగమూర్తి , ప్రదీప్ , ఎర్రయ్య పాల్గొన్నారు.

# జాతీయ సెమినార్‌కు హాజరుకానున్న ప్రొఫెసర్ హరగోపాల్

**వరంగల్ ఫిబ్రవరి20 (నినాదం న్యూస్ ) :** కేయు లో మార్చి21,22 తేదిలలో జరుగు జాతీయ సెమినార్ కు ముఖ్య ఉపన్యాసకులుగా ప్రొఫెసర్ జి.హరగోపాల్ హజరవుతున్నట్లు కె.యు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో ఆధ్వర్యంలో మార్చి 21, 22 తేదీలలో "భారతీయ సమాజంలో సంకీర్ణ రాజకీయాలు మరియు సామాజిక పరిస్థితి"అనే అంశంపై జరిగే జాతీయ సెమినార్ ప్రారంభ సమావేశానికి ముఖ్య ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటీ రాజనీతి శాస్త్ర విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ ని ఆహ్వానించినట్లు కె.యు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. గురువారం హైదరాబాదులో ప్రొఫెసర్ జి.హరగోపాల్ వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రొఫెసర్ జి.హర గోపాల్ తప్పకుండా జాతీయ సెమినార్ కు హాజరవుతానని మాట ఇచ్చాం న్నారు. ఈకార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ ,డాక్టర్ వాడపల్లి నాగరాజు ,రీసెర్చ్ స్కాలర్స్ అంకెళ్ల శంకర్ , కలిపికొం డ వినోద్ తదితరులు ఉన్నారు.



## ఒత్తిడి లేని విద్య అవసరం: పగిడోజు వెంకటరమణ



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 20 (నినాదం న్యూస్) :** ఒత్తిడి లేని విద్య ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు ఎంతో అవసరమని టి టి టి ఎస్ నీలగిరి 171 బ్యాచ్ మోటివేషనల్ స్పీకర్ పగిడోజు వెంకటరమణ అన్నారు. గురువారం ఫణిగిరి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని తెలుసుకొని ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు యాకూబ్ పాష ,రమేష్, ఎల్లయ్య, భాస్కర్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**-మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్**



**కోదాడ,ఫిబ్రవరి 20(నినాదం న్యూస్):** కోదాడ నియోజకవర్గ అభివృద్ధికై నిత్యం పరితపించే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ల పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపమ్మ సుధీర్ అన్నారు.గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం లో డైరెక్టర్ తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సోషల్ మీడియా వేదికగా ఉత్తమ్ దంపతులపై పట్టణానికి చెందిన ఓ వ్యక్తి చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు.గెలిచిన ఏడాది లోపే 1200 కోట్ల రూపాయలతో తాగునీరు,సాగునీరు రోడ్లు,డ్రైనేజీ,కాలువలతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నది ఎమ్మెల్యే పద్మావతి అని అన్నారు. మత రాజకీయాలు, కుల రాజకీయాలు చేయడం ఉత్తమం దంపతులకు తెలియదని, మరోసారి అర్థ రహితమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బషీర్,మల్లు వెంకట్ రెడ్డి, గునుగుంట్ల శ్రీనివాస రావు,పొలంపల్లి వెంకటేశ్వర్లు,రాపాలి శ్రీను,చింతకుంట్ల సూర్యం,తమ్మనబోయిన వీరబాబు,జొన్నలగడ్డ మణెమ్మ,దొంగల నాగ వేణు,పోతుగంటి అభిరామ్ పాల్గొన్నారు

# తెలుగుకు పునర్వైభవం తేవాలి

## తెలుగుకు పట్టిన తెగులును వదిలించాలి

జంతువుల నుండి మానవుని వేరు చేసేది భాష ఒక్కటే. భాష లేకపోతే మన భావాలను ఇతరులతో వ్యక్తీకరించడం సాధ్యం కాదు. సమాజం ద్వారా వ్యక్తి లోనికి ప్రవేశించి వ్యక్తిని సామాజికుడిని చేసేది మాతృభాష. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతోంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది.. ఇదంతా గత కాలం గురించి పూర్తిగా తెలిసిన తెలుగు వారికి, తెలియనిది ఏమీ కాదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. వెనుజులకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి భారతదేశం గుండా ప్రయాణిస్తూ, తెలుగు భాషలోని పదాలు ఇటాలియన్ భాష వలె అజంతాలు (అచ్చు చివరన కలిగి) గా ఉండటం గమనించి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి – విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టి పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికీ అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు ... ప్రఖ్యాత ఆంగ్ల కవి విలియం షేక్స్పియర్ ఏమి చదవుకుని, ఆంగ్ల సాహిత్య శిఖరంలా ఎదిగారనేది అర్థం చేసుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు 9.3 కోట్ల మందికి మాతృభాషగా ఉంది. భారతావనిలో హిందీ 366 మిలియన్ల, బెంగాలీ 83 మిలియన్ల, తెలుగు 74 మిలియన్ల, తర్వాత మరాఠీ 72, తమిళం 61, కన్నడం 55, ఉర్దూ 52, గుజరాతీ 46, మలయాళం 33, ఒరియా 33 మిలియన్ల మంది మాట్లాడుతూ 10 స్థానాలలో ఉన్నారు. తెలుగు భాషను 2008 అక్టోబరు 31న భారత ప్రభుత్వం ప్రాచీన భాషగా గుర్తించింది. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణా, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దు కుంటోంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. తెలుగు భాషాభిమానులు ప్రపంచ వ్యాప్తంగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేశారు. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు " తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాలి. మారిషస్ లో తెలుగు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయ స్థాయి కోర్సుల నిర్వహణబీ ఆస్ట్రేలియా ప్రభుత్వం అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలుగుతున్నది. అమెరికాలో తెలుగు వారి కోసం బ్యాలెట్లపై ఇటీవలే తెలుగులో ముద్రించడం వంటి అంశాలను గమనించాలి. పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్దంగా ఉన్న తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ తీసుకున్న చొరవను, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి సి. పి. బ్రౌన్ అందించిన సేవలను ఒకసారి గుర్తు చేసుకోవాలి. గొప్పలను ప్రదర్శించడం కాదు... గొప్పలను నిలబెట్టు కోవడమే గొప్ప.

# విహారయాత్ర విషాదాంతం

**- ఈత కోసం తుంగభద్ర నదిలో దిగిన డాక్టర్ మృతి**



**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన ఓ లేడీ డాక్టర్‌కు ఈతే ఆమె పాలిట మృత్యువుగా మారింది. కర్ణాటక రాష్ట్రంలోని హంపిలో ఈ ఘటన చోటుచేసుకుంది. హంపి వద్ద హైదరాబాద్‌కు చెందిన లేడీ డాక్టర్ మృతి తీవ్ర కలకలం రేపుతోంది. విహారయాత్రకు వెళ్లిన అనన్యరావు ఈత కోసం తుంగభద్ర నదిలో దూకారు. అయితే కాసేపటికే నీటి ప్రవాహంలో ఆమె కొట్టుకుపోయారు. రెండు రోజుల క్రితం స్నేహితులతో కలిసి ట్రిప్‌కు వెళ్లారు డాక్టర్ అనన్య రావు. హంపిలోని ఓ రిసార్ట్‌లో స్నేహితులతో కలిసి స్టే చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత తుంగభద్ర నదిని చూసేందుకు వెళ్లిన సమయంలో ఆ నదిలో ఈతకొట్టాలని వారు భావించారు. ఈ క్రమంలో డాక్టర్ అనన్య రావు 25 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకారు. కాసేపు స్విమ్మింగ్ చేశారు. అయితే కొద్దిసేపటికే మరోవైపు నుంచి అలలు రావడంతో నీటి ప్రవాహంలో డాక్టర్ కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన స్నేహితులు ఆమెను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తుంగభద్రలో అనన్యరావు దూకుతున్న దృశ్యాలను స్నేహితులు వీడియో తీశారు. రెండు నిమిషాల పాటు స్విమ్మింగ్ చేయగా.. ఆ సమయంలో వ్యతిరేక దిశలో అలలు రావడంతోనే లేడీ డాక్టర్ కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు స్నేహితులు. వెంటనే వారు అక్కడకు చేరుకుని దాదాపు మూడు గంటల పాటు తుంగభద్ర నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు అనన్యరావు మృతదేహాన్ని బయటకు తీశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ కుమార్తె అనన్యరావు. ఆమె కూడా డాక్టర్ చదవు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో స్నేహితులతో కలిసి విహారయత్రకు వెళ్లిన అనన్యరావు ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మృతి సమాచారం తెలుసుకున్న అనన్యరావు తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## కూలీ పనులు పరిశీలించి... పలుగు పారా పట్టిన కలెక్టర్

**భూగర్భ జలాలు భవిష్యత్తు తరాలకు అందించాలని పిలుపు**

హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం ఉదయం టేకులపల్లి మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పారా పట్టి పారం పాండు పనుల్లో పాల్గొన్నారు. స్వయంగా మట్టిని తట్టలోకి ఎత్తి దానిని మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకి భూగర్భ జలాలు ఉండాలంటే ప్రతి రైతు వ్యవసాయ భూములలో పారం పాండు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఉపాధి కూలీల సాధకబాధకలు తెలుసుకున్నారు. పలు గ్రామాలలో విద్యుత్ సమస్య, పోడు భూముల్లో విద్యుత్ సమస్యల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రస్తుతం రైతులకు మిర్చి వాణిజ్య పంటలే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మునగ సాగు, వెదురు సాగుపై అవగాహన కల్పించారు. పలు గ్రామాలలో మునగ సాగు క్షేత్రాన్ని పరిశీలించారు. మునగ సాగుపై అధిక లాభం సాధించవచ్చని సూచించారు. కలెక్టర్‌తోపాటు డీఎల్‌పీఓ రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీవో రవీందర్ రావు, ఎంపీ ఓ గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ బుజ్జి కన్నయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి నా దేవుడు

## పూజ గదిలో రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టుకున్న కుమారి ఆంటీ... వీడియో వైరల్

**హైదరాబాద్:** కుమారి ఆంటీ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. తన ఇంట్లోని పూజ గదిలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకున్న ఆమె.. ప్రతి రోజూ దేవుళ్లతో పాటు నిత్యం హారతులిస్తూ రేవంత్ రెడ్డికి కూడా పూజలు చేస్తున్నారు. ఈ రోజు తాను ఫుడ్ స్టాల్ నడిపిస్తున్నానంటే అందుకు కారణం సీఎం అని, ఆయన తనకు దేవుడితో సమానం అని అందుకే పూజలు చేస్తుంటానని చెప్పుకొచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా నెట్టింట్లో వైరల్ అవుతోంది. సీఎంపై ప్రత్యేక అభిమానం హైదరాబాద్ మాదాపూర్ దుర్గం చెరువు సమీపంలో కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ నడుపుతున్నారు. ఆమె ఫుడ్ స్టాల్‌లో తక్కువ ధరకే ఫుడ్ దొరుకుతుందని, టేస్టీగా ఉంటుందని కొందరు గతంలో సోషల్ మీడియాలో ఆమె వీడియోలో షేర్ చేశారు. ఆ వీడియోలు కాస్త వైరల్ గా మారడంతో కుమారి ఆంటీ సెలబ్రేటీగా మారారు. అయితే, పోలీసులు కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్ తొలగించేందుకు ప్రయత్నించారు. కానీ, సీఎం రేవంత్ స్పందించి తొలగించవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కుమారీ ఆంటీ సీఎం రేవంత్ రెడ్డిపై ప్రత్యేక అభిమానాన్ని పెంచుకుంది.

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసుపై

# ప్రభుత్వ కీలక నిర్ణయం

- సీబీసీఐడీ విచారణకు ఆదేశం
- గండ్ర వెంకటరమణారెడ్డే హత్య చేయించాడని మృతుడి భార్య ఆరోపణలు



హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య తీవ్ర కలకలం రేపుతోంది. లింగమూర్తి హత్య ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ హత్యపై సీబీసీఐడీ ఎంక్వైరీ వేయాలని నిర్ణయించింది. మేడిగడ్డ అవినీతిపై పోరాడుతున్నందుకే లింగమూర్తిని హత్య చేసారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన అనుచరులే రాజలింగమూర్తిని చంపారని మృతుడి భార్య, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా నడిరోడ్డు మీద తన భర్తను హత్య చేయించారన్న రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు. అన్ని ఆపేస్తే పది లక్షల రూపాయలు ఇస్తామని గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారని తెలిపారు. మేడిగడ్డ కేసు గెలుస్తామని అక్కస్సుతో తన భర్తను దారుణంగా హత్య చేయించారని అన్నారు. కొత్త హరిబాబు రేణిగుంట్ల సంజీవ్ బుర్ర చంద్రయ్య, బుర్ర కొమురయ్య రేనిగుంట్ల కొమురయ్య మరికొంతమంది కలిసి హత్య చేశారని సరళ ఆరోపించారు. ఇప్పటికే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు రాజలింగమూర్తి బంధువులు చేరుకున్నారు. కాగా... బైక్‌పై వెళ్తున్న రాజలింగమూర్తిని ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై లింగమూర్తి కేసు వేశారు. ఆ ఫిర్యాదుతో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఐదుగురిపై కేసు నమోదు అయ్యింది. దీంతో పాటు భూపాలపల్లిలో వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై రాజలింగమూర్తి కేసు వేశారు.

## హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

- భూ కబ్జాదారుల ఆటకట్టిస్తున్న హైడ్రా
- విలేకరుల సమావేశంలో శివారు ప్రాంత బాధితులు

హైదరాబాద్: హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడిరచారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయరానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవ సాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగుమల్లి, భువనవిజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళ్ల కృషి చేసి విజయం సాధించాయి. అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం-భారతదేశం, జిజ్ఞాస %-% భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగుఅసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ %-% కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్దెన్-ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఐజ్లాండ్ %-% న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాడ్మింటన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి %-% న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి %-% ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖతర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలో కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించా ల్సిన అవసరం అనివార్యంగా ఉంది.